క్లుప్తంగా

శ్రీవారికి స్నపన తిరుమంజన సేవ



తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి టౌన్: బ్రహ్మోత్సవం జరిగి 16 రోజుల తరువాత చైత్ర మాసం శుద్ధ పంచమి రోహిణి నక్షత్రం ఆదివారం శ్రీదేవి భూదేవి వసంత వల్లభుల స్వామి వార్లకు వసంతోత్సవం, రంగ మండపంలో స్నపన తిరుమంజన సేవను అర్చకులు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామిని తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

వేలం పాట రేపు

ముదిగుబ్బ: సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా సీతమ్మ వారి తరపున ఒక జంట, కోదండ రామస్వామి వారి తరపున ఒక జంట పెళ్లి పీటల మీద కూర్చుని వివాహం చేయించుటకు ఈనెల 28న ఉదయం 10 గంటలకు ఆంజనేయస్వామి గుడి వద్ద బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

3న పింఛన్ల పంపిణీ

ముదిగుబ్బ: ఏప్రిల్ 3న పింఛన్లను పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ విజయ లక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 ఆర్‌బీఐ సెలవు, అదే విధంగా 2వ తేదీన ఆదివారం కావడంతో 3వ తేది పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు. పింఛన్‌దారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

గేట్‌మీట్ వాయిదా

కదిరి అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈనెల 28వ తేదీన తలపెట్టిన గేట్ మీట్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆ సంఘం కదిరి డిపో నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో సత్యసాయి జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్‌ను ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు కేబీఎన్ రెడ్డి, జీవైపీ రావు, నారాయణ స్వామి, రమణప్ప తదితరులు చర్చలు జరిపారన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి హామీ ఇవ్వడంతో గేట్‌మీట్ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

దాదులూరు పోతలయ్యకు ప్రత్యేక పూజలు



అలంకరణలో పోతలయ్యస్వామి

కనగానపల్లి: దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పండుగ తర్వాత చుట్టుపక్కల గ్రామాల స్వామికాపులు, భక్తులు ఆలయానికి వచ్చిస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పోతలయ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

నేడు స్పందన

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహిస్తామని తహసీల్దార్ పీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమం మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరి దేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండల స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలను అందజేయవచ్చని తెలిపారు.

నేడు వేలం పాట

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో వారపు సంత కోసం పంచాయతీ గదులకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అశోక్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. 16 పంచాయతీ గదులకు స్థానిక సచివాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలంలో ఆసక్తి కలిగిన వారు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

నల్లచెరువు: స్థానిక వైఎస్సార్ కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఏఈ వాగ్దేవితో మాట్లాడి సమస్యను పరిష్కరించారని సర్పంచ్ పంచరత్నమ్మ తెలిపారు. ఆదివారం కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని పేర్కొన్నారు.

నేనున్నానని.. మీకేం కాదని

పోట్లమర్రి ప్రమాద బాధిత కుటుంబాలకు సీఎం జగన్ అండ

- ఆరుగురి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరు
- సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.30 లక్షల విలువైన చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి
- సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబాలు



To
Sri Y.S. Jagan Mohan Reddy garu,
Hon'ble Chief Minister,
Government of Andhra Pradesh.

సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయం అందించాలని సీఎం జగన్ ఉత్తర్వులు జారీ చేసిన దృశ్యం



బాధిత కుటుంబాలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం: చిన్న ఏమరుపాటు కారణంగా మార్చి 17న పోట్లమర్రి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పోట్లమర్రికి చెందిన మల్లేష్ (48), గొట్లూరు గ్రామానికి చెందిన దాసరి ఈశ్వరయ్య (45), ధర్మవరం పట్టణం కొత్తపేటకు చెందిన హాజీపీరా (52), ముదిగుబ్బ మండలం నల్లయ్యకుంటకు చెందిన గాలి నారాయణస్వామి (49), ధర్మవరం పట్టణం శివానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నర్సింహులు (41) ఘటనా స్థలంలో మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ధర్మవరం పట్టణానికి చెందిన ఫయాజ్ మహ్మద్ బత్తలపల్లిలో ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంటి పెద్ద మరణంతో కుటుంబాలు దిక్కు తోచని స్థితిలో పడ్డాయి. ప్రమాద విషయం తెలియగానే ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అధికారులతో మాట్లాడి, హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం విషయమై వారి దీనస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు సీఎం జగన్ వెంటనే స్పందించి ఒక్కో కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల చొప్పున 6 కుటుంబాలకు మొత్తం రూ.30 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించేలా చర్యలు చేపట్టారు. ఆదివారం పరిహారపు చెక్కులను ఎమ్మెల్యే కేతిరెడ్డి బాధిత కుటుంబాలకు అందించారు. ప్రభుత్వం త్వరితగతిన ఇంత పెద్ద ఎత్తున సహాయం అందించడంతో బాధిత కుటుంబాలు కన్నీటి పర్యంతమయ్యాయి. కుటుంబ పెద్దను కోల్పోయిన తమకు ప్రభుత్వమే ఇంటి పెద్దగా మారి ఆదుకుందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి తమపై చూపిన ప్రేమాభిమానాలను జీవితంలో మరువలేమన్నారు.

ప్రభుత్వ సాయం మరువలేం



నా భర్త మల్లేష్ ఆటో ప్రమాదంలో మృతి చెందాడు. ఇంటి పెద్ద మరణంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయాం. ఈ తరుణంలో ప్రభుత్వం రూ.5 లక్షల సాయం అందింది. మా కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. సీఎం జగన్ అందించిన సాయం ఎప్పటికీ మరువలేం.

– బత్తల నాగేంద్రమ్మ, (మృతుడు మల్లేష్ భార్య, పోట్లమర్రి)

ఎమ్మెల్యే కేతిరెడ్డికి కృతజ్ఞతలు



ఆటో ప్రమాదంలో నా భర్త ఫయాజ్ మహ్మద్ మృతి చెందాడు. చిన్న పాప షాహిస్తా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. రోజు కూలీ పనులు చేసుకుని జీవించేవాళ్లం. ఇంటి పెద్ద మరణంతో దిక్కులేని వారమయ్యాం. రూ.5 లక్షల ప్రభుత్వం సాయం అందించడమే కాకుండా 5 ఏళ్ల పాప షాహిస్తా వైద్య ఖర్చులకు ఎంతో సాయం అందించారు. మాలాంటి పేద వారికి అండగా నిలిచిన ఎమ్మెల్యే కేతిరెడ్డి చూపిన ప్రేమాభిమానాలు మరువలేం.

– షాహీదా భాను, (మృతుడు ఫయాజ్ మహ్మద్ భార్య)

సీఎం జగన్‌ను మరచిపోనయ్యా..



ఆటో ప్రమాదంలో నా భర్త గాలి నారాయణస్వామి చనిపోవడంతో వృద్ధాప్యంలో తనని ఎవరు చూస్తారని బాధపడ్డాను. అయితే సీఎం జగన్ మా ఇంటికి పెద్ద కొడుకులా అండగా నిలిచారు. ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించారు. సీఎం జగన్ చేసిన సాయం మరచిపోలేనయ్యా.

– గాలి కేశమ్మ, (మృతుడు గాలి నారాయణస్వామి భార్య), ముదిగుబ్బ మండలం

చదువులకు సాయం చేస్తామన్నారు..



నా భర్త దాసరి ఈశ్వరయ్య చనిపోవడంతో పిల్లలను ఎలా పోషించాలో అని మదనపడ్డాను. నాతో పాటు పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం కుటుంబ పోషణకు రూ.5 లక్షలు సాయం అందించింది. పిల్లల చదువులకు సాయం అందిస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి భరోసా ఇవ్వడం సంతోషంగా ఉంది.

– దాసరి లక్ష్మీదేవి, (మృతుడు దాసరి ఈశ్వరయ్య భార్య)

భరోసా ఇచ్చారు



మా నాన్న తన్నీరు నరసింహులు ఆటో ప్రమాదంలో చనిపోవడం చాలా బాధగా ఉంది. ప్రభుత్వం రూ.5 లక్షలు అందడంతో మా చదువులు, కుటుంబ పోషణకు ఉపయోగపడుతాయి. ఏ కష్టమొచ్చినా నేరుగా తన వద్దకు రావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి అన్న భరోసానిచ్చారు.

– అనూష, సర్వలింగేశ్వర, (మృతుడు నరసింహులు కుమారుడు, కుమార్తె)

ఆర్థికసాయం అందజేత



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న గాండ్ల సంక్షేమ సంఘం నాయకులు

ముదిగుబ్బ: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ముదిగుబ్బ గ్రామానికి చెందిన ఎల్లూరు ప్రసాద్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కుడి కాలికి గాయం కావడంతో తొలగించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అనంతపురం జిల్లా గాండ్ల సంక్షేమ సంఘం రూ.1,15,750 సేకరించారు. ఆదివారం బాధిత కుటుంబానికి నగదు అందజేశారు. కార్యక్రమంలో ముదిగుబ్బ గాండ్ల సంఘం అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసులు, ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ గాండ్ల సంఘం అధ్యక్షులు చింతకుంట రామయ్య, మాజీ గాండ్ల కార్పొరేషన్ చైర్మెన్ విశాలాక్షి, కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మినరసయ్య, మాజీ సంఘం ట్రెజరర్ గవ్వల లక్ష్మీనారాయణ, గాండ్ల సంఘం నాయకులు సీవీ కృష్ణమూర్తి, పార్నపల్లి రామాంజినేయులు, చిగిచెర్ల నాగరాజు, పార్నపల్లి రవి, గాండ్లవారిపల్లి శ్రీనివాసులు, మేడాపురం రమణ, గార్లదిన్నె భాస్కర్, ఎల్లూరు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు క్యాంపులు

బత్తలపల్లి: మండలంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు నాలుగో విడత ఆధార్ ఎన్రోల్‌మెంట్, డాక్యుమెంట్ అప్డేట్ చేసుకోవడానికి వీలుగా మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఆయా గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో ఆధార్ ఎన్రోల్‌మెంట్, డాక్యుమెంట్ అప్డేట్ జరుగుతుందన్నారు. 27వ తేదీన మాల్యవంతం, సంజీవపురం, రామాపురం సచివాలయాల్లో, 28న డి.చెర్లోపల్లి, ఈదుల ముష్టూరు, మాల్యవంతం సచివాలయాల్లో, 29న పోట్లమర్రి, ఈదుల ముష్టూరు, దంపెట్ల సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 2010 నుంచి 2016 సంవత్సరం వరకూ ఆధార్ చేయించుకున్న వారు ఆధార్ డాక్యుమెంట్ అప్డేట్ చేయించుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లలు థంబ్ వేయించుకోవాలన్నారు.

30న సీతారాముల గ్రామోత్సవం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నిమ్మలకుంట గ్రామంలో ఈనెల 30న సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వీరాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త శింగమశెట్టి కుళ్లాయప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామోత్సవం సందర్భంగా కీలు గుర్రాలు, చెక్క భజన, కీర్తనలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు.

ట్రాక్టర్ - ద్విచక్ర వాహనం ఢీ

రొద్దం: మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం ట్రాక్టర్ – ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు గౌరాజుపల్లి నుంచి రొద్దం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్‌ని ఢీకొనడంతో రామ్మోహన్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

ఇద్దరికి గాయాలు

కూడేరు: మండల కేంద్రంలోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్ ఢీకొనడంతో పోలప్ప, శివయ్య తీవ్రంగా గాయపడ్డారు. బస్ ఉరవకొండ వైపు వెళుతోంది. పూలకుంటకు చెందిన వారిద్దరూ ద్విచక్ర వాహనంలో పెన్నహోబిళం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం తరలించారు.

వ్యక్తి అదృశ్యం

హిందూపురం: మేళాపురానికి చెందిన కర్పెంటర్ సిగ్బాతుల్లా (52) కనిపించడం లేదని ఆయన కుమారుడు నౌషాద్ ఆదివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 19న ఉదయం బయటకు వెళ్లి వస్తానని చెప్పి మళ్లీ ఇంటికి రాలేదన్నారు. సెల్ కూడా స్విచ్ఛాఫ్ వస్తోందన్నారు. తెల్లషర్టు, తెల్ల ప్యాంటు ధరించాడని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన జింక



పరిగి: మండలంలోని శాసనకోట పంచాయతీ పరిధిలో రోడ్డు ప్రమాదంలో జింక గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. చిలమత్తూరు మండలంలోని కొడికొండ నుంచి మడకశిర నియోజకవర్గాన్ని దాటుతూ కర్ణాటక శిర వరకూ నిర్మించిన జాతీయ రహదారి 544 ఈఈలో ఆదివారం మధ్యాహ్న సమయంలో రోడ్డుపైకి జింక వెళ్లింది. అదే సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం జింకను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అటవీ శాఖ అధికారులను సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న అధికారులు చికిత్స నిమిత్తం జింకను తీసుకెళ్లారు.

ఉపాధి లేని యువతపై సర్వే

హిందూపురం టౌన్: పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మండలంలోని కొటిపి పంచాయతీ ఇస్లాంపురంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ అశ్వర్థనారాయణ పర్యవేక్షణలో అధికారిక విద్య లేదా సాధారణ ఉపాధిలేని యువతపై సర్వే నిర్వహించారు. సేకరించిన సమాచారాన్ని శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విభాగానికి సమర్పించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ రెడ్డి తెలిపారు.

లోకేష్ వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న డీఎస్ కేశరెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు

పుట్టపర్తి: యువగళం పాదయాత్రలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై లోకేష్ చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలువురు విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి డైరెక్షన్‌లోనే లోకేష్ ఈ వాఖ్యలు చేశారని విమర్శించారు. టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న పల్లె ఏమీ ఒరగ బెట్టారని ప్రశ్నించారు. చిత్రావతిలో ఇసుకను కర్ణాటకకు తరలించి రూ.వేల కోట్లు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. వీటిపై బహిరంగ చర్చకు లోకేష్ సిద్దమా? సవాల్ విసిరారు. పల్లె సుద్దులను లోకేష వల్లె వేశారన్నారు. అయితే సీఎం జగన్ సహకారంతో పుట్టపర్తి అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి విశేషంగా కృషి చేశారని తెలిపారు. పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లా, జాతీయ రహదారులు మంజూరు చేశారని పేర్కొన్నారు. సిమెంట్ రోడ్లు, నియోజకవర్గంలో 25 వేల వైఎస్సార్ గృహాలు వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి సిద్దరాంపురం కేశప్ప, మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, లింగాల భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, పుట్టపర్తిటౌన్, నల్లమాడ కన్వీనర్లు రంగారెడ్డి, కుళ్లాయినాయక్, మాజీ కన్వీనర్ గంగాద్రి, రెడ్డప్పరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నరసారెడ్డి, మాజీ కౌన్సిలర్ మున్వర్‌బాషా, నారాయణరెడ్డి, కడప రాజా తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన ఆశయసాధనకు కృషి



యోగి వేమన విగ్రహావిష్కరణకు హాజరైన నాయకులు

మడకశిర రూరల్: విశ్వకవి యోగివేమన ఆశయ సాధనకు ప్రతి ఒక్క రెడ్డి సామాజికవర్గ సభ్యుడూ కృషి చేయాలని రాష్ట్ర రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆదిరెడ్డి పాళ్యం సర్కిల్‌లో విశ్వకవి యోగివేమన విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరై మాట్లాడారు. రెడ్డి సంఘం కల్యాణ మండప నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రెడ్డి సంఘాన్ని బలోపేతం చేసి పేద విద్యార్థుల చదువుకు సహకారం అందించాలన్నారు. రాష్ట్ర, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు, సభ్యులు ధర్మారెడ్డి, బయపరెడ్డి, గోపాల్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె: కమలాపురం, బూదేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది వివరాల మేరకు.. కొప్పలకొండకు చెందిన నాగన్న అనే వ్యక్తి పాములాయి చెరువులో శనివారం రాత్రి చేపల వేటకు వెళ్లి ఉదయం బైక్‌పై ఇంటికి వెళ్లాడు. కమలాపురం సమీపంలోకి రాగానే కునుకు తీయడంతో బైక్‌పై నుంచి పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అలాగే యర్రగుంట్లకు చెందిన ఖాసీంవలి, షాజహాన్ బైక్‌పై గార్లదిన్నెకు వెళ్తున్న సమయంలో బూదేడు క్రాస్ సమీపంలో కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఆదివారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. యాడికికి చెందిన రాము పని మీద బైక్‌పై గుత్తికి వచ్చి పని అయిపోయాక తిరిగి యాడికికి బయలు దేరాడు. గుత్తిలోని తాడిపత్రి రోడ్డులో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం వజ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 415 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరికి బెంగళూరులో కంటి ఆపరేషన్లు చేయించి, కదిరికి తీసుకువస్తారు. వైద్య శిబిరాన్ని వజ్ర ఫౌండేషన్ అధినేత వజ్రభాస్కర్‌రెడ్డి సందర్శించి వృద్ధులకు సూచనలిచ్చారు.

ఏప్రిల్ 2న ధర్మవరంలో..

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరం వృద్ధులకు ఎంతో ఊరటనిస్తుందని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాస్, కార్యదర్శి సుకుమార్ తెలిపారు. పట్టణంలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కర్నూలుకు చెందిన శ్రీ చక్ర ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి రాధాకృష్ణ, సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, చాంద్‌బాషా, శ్రీనివాసులు, పీఆర్‌ఓ జయరాం, నాగేంద్ర, శీలా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



తాడిమర్రి పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పండుగ మరుసటి రోజున పౌర్ణమి జరుపుకోవాల్సి ఉండగా.. గురువారం రావడంతో ఆదివారం పౌర్ణాన్ని ఘనంగా జరుపుకున్నారు. తాడిమర్రి, కునుకుంట్ల, పెద్దకోట్ల, నార్సింపల్లి తదితర గ్రామాల్లోని పెద్దమ్మ, చౌడమ్మ, ఎల్లమ్మ తదితర ఆలయాల్లో భక్తులు బోనాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో అమ్మవారి మూలవిరాట్‌లకు వెండి ఆభరణాలు తొడిగి పూలమాలతో అలంకరించారు. జంతు బలులు ఇచ్చి నైవేద్యం సమర్పించారు.

బోనాల ఊరేగింపు

నల్లచెరువు: మండల పరిధిలోని దేవరింటిపల్లి సమీపంలో కొలువుదీరిన మచ్చాలమ్మ దేవస్థానంలో ఆదివారం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నల్లమాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకూ ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఆర్.రామాపురం వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హేమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతిలో చేరడానికి, పదో తరగతి విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి అర్హులన్నారు. ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు ఖాళీ ఉండగా, ఎస్సీ-70, ఎస్టీ-5, బీసీ-4, ఓసీ-1 రిజర్వేషన్ ప్రకారం కేటాయించడం జరిగిందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్ఈసీలో 40, సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీ ఉన్నట్లు వెల్లడించారు.